క్లుప్తంగా

మధురంగా సాగిన సప్తవాయిద్య విన్యాసం



విజయవాడకల్చరల్: ఫోక్ ఆర్టిస్ట్ నేషనల్ వెల్ఫేర్ సొసైటీ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సినీసంగీత విభావరి, సప్తవాద్య సమ్మేళనం మధురంగా సాగింది. డాక్టర్ సురేష్‌కుమార్, గాయకులు వనం ప్రసాద్, అనిల్‌జ్యోతి గీతాలు ఆలపించగా కీబోర్డ్ ప్లేయర్ ప్రసాద్, డ్రమ్ వాద్య కళాకారుడు వై అనిల్‌కుమార్, తబలా కళాకారుడు ఎల్ ప్రభాకర్ వాద్యసహకారం అందించారు. డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. నగర సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు విజయలక్ష్మి, డేవిడ్‌రాజు, జోషి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. గాయకులను నిర్వాహకులు సత్కరించారు.

రవికుమార్ సాహిత్య సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: తల్లాప్రగడ రవికుమార్ సాహిత్య సేవలు వెలకట్టలేనివని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. రవికుమార్ మిత్రబృందం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి, రచయిత పరిశోధకుడు తల్లాపగడ రవికుమార్ సంస్మరణ సభను గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రవికుమార్ సామాజిక స్పృహ కలిగిన రచయిత అని చెప్పారు. కృష్ణా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ రవి కుమార్ అనేక రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నాడని గుర్తుచేశారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ రవికుమార్ అనేకమంది రచయితలకు ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. రవికుమార్ కుటుంబ సభ్యులు శశిధర్, తల్లా ప్రగడ శైలేష్ వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, చలపాక ప్రకాష్, జానపద గాయకుడు దామోదర గణపతిరావు, సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ శర్మ, డాక్టర్ యశో పూర్ణచంద్రరావు, కళాసాగర్, డాక్టర్ వెన్నా వల్లభరావు, గోళ్ళ నారాయణరావు ఆయనతో అనుబంధం గుర్తుచేసుకున్నారు. రవి కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

చంద్రబాబు మోస రాజకీయాలకు తెర తీశారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల్లో ఓటమి తప్పదని అర్థమైన చంద్రబాబు మోస రాజకీయాలకు తెర తీస్తున్నారని, ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఎత్తే అర్హత ఆయనకు లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. ముత్యాలంపాడులో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని నైజం చంద్రబాబుది కాగా మేనిఫెస్టోను అతి పవిత్ర గ్రంథంగా భావించే వ్యక్తిత్వం జగన్‌ది అని అన్నారు. సీఎం జగనన్నపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే చంద్రబాబు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 64వ డివిజన్‌కు చెందిన 100 మంది టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తికరంగా ఉన్నారని తెలపడానికి పార్టీలకతీతంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్న ఈ చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



ఇందిరానాయకనగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతో దోహదపడ్డాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ నూతన మేనిఫెస్టోను వివరించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ డివిజన్ చూసినా జగనన్న మార్క్ పాలన కనిపిస్తోందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపడం సంతోషంగా ఉందని అన్నారు.

కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు..

నగర శివారు ప్రాంతంగా పేరుగాంచిన స్థానిక 58వ డివిజన్‌లో జగనన్న పాలనలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే వెలంపల్లి వివరించారు. ఈ డివిజన్‌లో రోడ్ల కోసం రూ. 30 కోట్ల వరకూ నిధులు మంజూరు చేశామని, అలానే సింగ్ నగర్, పాయకాపురం పరిసర ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఎక్సెల్‌ప్లాంట్‌ను తరలించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని పేర్కొన్నారు.

చంద్రబాబు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్..

జగనన్న విశ్వసనీయతకు మారుపేరు అయితే చంద్రబాబు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని వెలంపల్లి ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో ఇంటిని, రాష్ట్రాన్ని వదిలేసి వెళ్లిన చంద్రబాబుకు రాష్ట్రంలో ఓటు అడిగే అర్హత లేదన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు సీఎం జగనన్న ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత వంటి పథకాలను ఎందుకు ప్రవేశపెట్టలేకపోయాడని ప్రశ్నించారు. చంద్రబాబుకు తన జీవితంలో సీఎం జగన్‌పై గెలిచే సత్తా లేదని అన్నారు. జగనన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించబోరని, ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు, కూటమికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ శ్రీశైలజ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సీఎం జగనన్న ప్రజారంజక పాలనను అందించారని అన్నారు. జగనన్న అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారు కాబట్టే నేడు ఏ గడపకు వెళ్లినా ప్రజలు ఆత్మీయంగా తమకు స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. గత టీడీపీ మేనిఫెస్టోలో ప్రజలకు ఎంతవరకు మేలు చేశారో చెప్పి.. ఆ తర్వాత ఈ మేనిఫెస్టో గురించి మాట్లాడాలన్నారు. చంద్రబాబు మాయ మాటలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని, టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీల పేరుతో దోచుకోవడం తప్ప ప్రజలకు ఏ మేలు జరగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తోట శ్రీనివాస్, రామచంద్రరావు, తోపుల వరలక్ష్మి, శర్మ, శ్రీనివాసరెడ్డి, శోభనాలు, బెజ్జం రవికుమార్, షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో...



59వ డివిజన్‌లో ఎమ్మెల్యే వెలంపల్లిని సత్కరిస్తున్న స్థానిక ప్రజలు

స్థానిక 59వ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాలతో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సింగ్‌నగర్‌లో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి చెందాలన్నా, మనందరికి సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వెలంపల్లిని స్థానిక ప్రజలు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, రమేష్‌రెడ్డి, సురేష్, చింతా చిన్నా, కొండా జయలక్ష్మి, శాంతకుమారి, షేక్ నాగుల్‌మీరా, అమిత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగన్‌ను సీఎం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరలా సీఎంని చేసుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్‌లో శుక్రవారం వెలంపల్లి సోదరుడు రాఘవతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యానుగుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని పథకాలనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరిచారని చెప్పుకొచ్చారు. మేనిఫెస్టోలో చెప్పకపోయినా అగ్రవర్ణ సామాజికవర్గాల్లోని పేద మహిళలకు మేలుచేయాలన్న సంకల్పంతో ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. రెండో విడత ద్వారా సెంట్రల్‌లో 2,593 మందికి రూ. 3.65 కోట్ల లబ్ధి చేకూర్చగా.. తొలి విడతలో 1,947 మంది ఖాతాల్లో రూ. 2 కోట్ల 92 లక్షల 5 వేలు జమ చేసినట్లు చెప్పారు. అటువంటి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, నాయకులు కనపర్తి కొండా, గండూరి మహేష్, అఫ్రోజ్, బాబ్జి, వెంకట్రావు, రిజ్వాన్, చిన్నారావు, స్వామి, దుర్గాప్రసాద్, రాజారత్నం, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు పింఛన్ కష్టాలు



మధురానగర్‌లో పింఛన్ కోసం వచ్చి పడిపోయిన వృద్ధురాలిని లేవదీస్తున్న స్థానికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇప్పటి వరకు ఠంచన్‌గా ఒకటోతేదీన ఇంటివద్దనే పింఛన్ అందుకుంటున్న అవ్వాతాతలకు చంద్రబాబు చర్యల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పింఛన్‌తో గర్వంగా జీవిస్తున్న అవ్వాతాతల జీవితాల్లో చంద్రబాబు చీకటి రోజులు రప్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా అవ్వాతాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు..

మధురానగర్ పప్పులమిల్లుకు చెందిన భారతి పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఈమెకు పింఛన్ బ్యాంకులో వేశారని అందరూ చెప్పుకోవడంతో శుక్రవారం ఉదయం తన దగ్గర ఉన్న పాత బ్యాంకు పుస్తకం తీసుకుని మధురానగర్ బ్యాంకుకు అతి కష్టం మీద వచ్చింది. అక్కడ బ్యాంకులో ఖాతాను వినియోగించడం లేదని, ఆధార్‌కార్డు తదితర వివరాలు తీసుకురావాలంటూ చెప్పారు. దీంతో ఉసూరు మంటూ తిరిగి ఇంటికి వెళ్లి ఆధార్ కార్డు తన దగ్గర ఉన్న పత్రాలతో బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు వారు రద్దీగా ఉందని శనివారం రమ్మని చెప్పడంతో తిరిగి ఇంటికి బయలుదేరారు. ఎండ వేడిమికి తాళలేక మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో సొమ్మసిల్లి పడిపోయారు. అదృష్టవశాత్తూ స్థానికులు గమనించడంతో ఆమెను పక్కనే ఉన్న డ్రెయిన్‌లో పడిపోకుండా పట్టుకున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇంటివద్ద దర్జాగా పింఛన్ అందుకునే అవ్వాతాతలను ఎండలో రోడ్డుపై తిప్పుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బ్యాంకుల చుట్టూ తిరిగే ఓపిక లేదు



నాకు వచ్చే పింఛన్‌తో ఎవరిమీద ఆధారపడకుండా గర్వంగా జీవిస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం మాదిరిగా ఠంఛన్‌గా ఒక్కటోతేదీన పింఛన్ వలంటీర్ ఇంటివద్దనే అందించేవారు. ఇప్పుడు పింఛన్ అసలు వేశారో లేదో మా బ్యాంకు ఖాతాలు పనిచేస్తున్నాయో లేదో తెలియడం లేదు. ఈ ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరిగే ఓపిక లేదు. వృద్ధులను ఈ విధంగా చంద్రబాబు ఇబ్బందులకు గురి చేయడం తగదు.

– బూరెల లక్ష్మయ్య, అయోధ్యనగర్

చంద్రబాబు వృద్ధుల ఆగ్రహానికి గురికాక తప్పదు



ఇప్పటి వరకు ప్రతీనెలా వలంటీర్ ద్వారా పింఛన్ అందుకున్నాను. ఇప్పుడు పింఛన్ బ్యాంకులో వేశారని చెబుతున్నారు. అసలు నా బ్యాంకు ఖాతా ఎక్కడ ఉందో కూడా గుర్తు లేదు. ఒక వైపు మండే ఎండల్లో బయటకు రావాలంటేనే భయంగా ఉంది. ఈ తరుణంలో బ్యాంకుల చుట్టూ మేము ఎలా తిరగగలం. చక్కగా నడుస్తున్న వ్యవస్థను పాడు చేయడం దుర్మార్గం, చంద్రబాబు వృద్ధుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

– పెన్నం రామచంద్రారెడ్డి, న్యూ అయోధ్యనగర్

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



63వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కేశినేని పావని, వెలంపల్లి శ్రీలక్ష్మి

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం 63వ డివిజన్ సుందరయ్యనగర్‌లో ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ సతీమణి కేశినేని పావని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు వెలంపల్లి శ్రీలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మహిళల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే మనకు పథకాలు కొనసాగుతాయని వారు తెలిపారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, మహిళల పేరుతో ఇళ్లస్థలాల పంపిణీ, మహిళల రక్షణ కోసం దిశచట్టం ఏర్పాటు చేసి అమలు చేయడం జరిగిందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యానుగుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మోదుగుల గణేష్, మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శుక్రవారం 61వ డివిజన్‌లో పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాంబేకాలనీ హెచ్‌బ్లాక్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్(నాని), వెలంపల్లి శ్రీనివాసరావులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బూత్ కన్వీనర్లు చీకటి నాగమణి, ఆర్ఎస్ నాయుడు, వి.వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్ మాచవరంలో శుక్రవారం కేశినేని నాని సతీమణి కేశినేని పావని, వెలంపల్లి కుటుంబసభ్యులు వెలంపల్లి శ్రీలక్ష్మి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతీ గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 27వ డివిజన్‌లో సిద్ధం శీనన్న కమిటీ ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు పారదర్శక సేవలు అందించాలి : కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. పోస్టల్ ఓటింగ్‌కు అర్హులైన వారు శనివారం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. కేంద్రీకృత ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో విధులు నిర్వర్తించే పోలింగ్ ఆఫీసర్లకు నిర్దేశించిన విధులపై అవగాహన కల్పించారు. వివరాల పరిశీలన, అనుబంధం-5లో సంతకం తీసుకోవడం, చేతి వేలుపై ఇంక్ మార్కు చేయడం, పోస్టల్ బ్యాలెట్ ఇష్యూ చేయడం తదితర అంశాలను వివరించారు. అదేవిధంగా ఫారం-13ఏ, ఫారం-13బీ, ఫారం-13సీ, ఫారం-13డీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరుస క్రమంలో వివరించారు. ప్రతి విషయంలోనూ అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఎస్‌ఈఓ యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఉమామహేశ్వర కళాక్షేత్రంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై కందికట్టు వాసుదేవరావు శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు విచ్చేసిన భక్తులు కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, ప్రజాసంకల్ప పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని అమలు చేశారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అపార గౌరవమని అన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం, కాపునేస్తం.. ఇలా ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేసి అసలైన మహిళా సాధికారత ఏంటో ఆచరణలో చూపారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆడపడుచులకు ఐదేళ్ల కాలంలో రూ. 1,89,519 కోట్ల సంక్షేమ లబ్ధిని చేకూర్చగా.. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో రూ. 402.46 కోట్ల సంక్షేమాన్ని అందజేసినట్లు వివరించారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 34,300 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 118 కోట్ల 61 లక్షలు., సున్నావడ్డీ పథకం ద్వారా 44,370 మందికి రూ. 26 కోట్ల 25 లక్షలు., వైఎస్సార్ చేయూత ద్వారా 10,654 మందికి రూ. 58 కోట్ల 99 లక్షలు., అమ్మఒడి పథకం ద్వారా 28,834 మంది తల్లులకు రూ. 118 కోట్ల 98 లక్షలు., వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 2,088 మందికి రూ. 21 కోట్ల 24 లక్షలు., ఈబీసీ నేస్తం ద్వారా 2,593 మందికి రూ. 6 కోట్ల 81 లక్షలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట..

మహిళా సంక్షేమం, సాధికారతకు పెద్దపీట వేస్తోన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత కూటమి నేతలకు ఏమాత్రం లేదని మల్లాది విష్ణు అన్నారు. అక్షరాలా రూ. 14,205 కోట్ల రుణ మొత్తాన్ని చెల్లించకుండా గత టీడీపీ ప్రభుత్వం అక్కచెల్లెమ్మలను మోసగించిందని ఆరోపించారు. మీ హయాంలో 'ఏ' గ్రేడ్‌గా ఉన్న డ్వాక్రా సంఘాలన్నీ నిర్వీర్యమై 'సి' గ్రేడ్‌లోకి పడిపోయింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో కీలక మంత్రిత్వ శాఖలు, నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థలు, కాంట్రాక్టులు, ఇతర పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని అన్నారు. అలాగే మహిళల భద్రత కోసం దిశ యాప్ తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

టీడీపీకి మహిళలపై గౌరవం లేదు..

ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీ నేతల తీరు మారలేదని.. రాజమండ్రిలో మహిళను కించపరిచేలా బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో తాము ఎవరిని గెలిపించుకోవాలో ఆడపడుచులు ఇప్పటికే నిర్ణయించుకున్నారని మల్లాది విష్ణు తెలిపారు. చంద్రబాబు, ఆయన మిత్రపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా విఫలమవక తప్పదని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి.. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి, నాయకులు మారుతి, చిన్నారావు, స్వామి, దుర్గాప్రసాద్, మోహన్, శ్రీను, ఆర్కే, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఓటు వేసి ఆశీర్వదించండి



గిరిపురంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు) రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓట్లు వేసి ఆశీర్వదించాలని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత కోరారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుల విజయాన్ని కాంక్షిస్తూ గిరిపురం, న్యూ గిరిపురంలో శుక్రవారం ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అనిత మాట్లాడుతూ ఐదేళ్లలో డివిజన్‌లో చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు, అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొమ్ము చంటి, కుక్కల రమేష్ పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 23వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుల విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని నాని అల్లుడు కాజ రఘు, వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వెలంపల్లి, ఎంపీ కేశినేని నానిని గెలిపించాలని కోరారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వాంబేకాలనీ హెచ్‌బ్లాక్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

ఏలూరు రోడ్డులో ఫ్లాగ్ మార్చ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం గుణదల పోలీసులు సీఆర్‌పీఎఫ్ జవానులతో కలిసి ఏలూరు రోడ్డులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని ప్రజల్లో భరోసా కల్పించేందుకు తాము ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం బీఆర్‌టీఎస్ రోడ్డు, గుణదల రామవరప్పాడు రింగ్ తదితర ప్రాంతాల మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఎస్ఐలు వెంకట్రావు, పూర్ణిమ, క్రైమ్ స్పాట్స్, క్లూస్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.